కమలా కాంత్

# స్నేహభ్రంశం

అర్ధరాత్రి మంచి నిద్రలో వున్న మూర్తిగారికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో బాబుగారూ అని పిలిచినట్లయింది. ఈ వేళ కాని వేళ ఎవరా అనుకుంటూ మంచందిగి ఒళ్ళు విరుచుకుని బద్ధకాన్ని పారద్రోలేరు.

ఆఫీసు జవాను రాములు ఒక్కడే తనని "బాబుగారూ" అని పిలుస్తాడు. అతనే అయివుంటాడు. ఈ అర్ధరాత్రి ఏమి ముంచుకొచ్చిందో అనుకొంటూ తలుపు తీశారు.

ఆయన ఊహ నిజమే అయింది.

"టెలిగ్రాం వచ్చిందండీ బాబుగారూ ముఖ్యమేమోనని ఆదరాబాదరా వచ్చేసినా" యాసమాటలతో జేబులోంచి టెలిగ్రాం కవరు తీసి మూర్తిగారికిచ్చేడు.

రాములు నెల్లూరు మనిషి. చాల నెమ్మదస్తుడు కష్టజీవి. ఆఫీసులో యింతవరకు ఒకరిచేత మాట అనిపించుకోలేదు. అలాంటివాడు కాబట్టే అర్ధరాత్రయినా విసుగులేకుండా టెలిగ్రాం యింటికి తెచ్చాడు. యింకోడయితే రేపొద్దున యివ్వొచ్చులే అని ముసుగుతన్ని పడుకునేవాడు.

"టెలిగ్రాం ఏమిటి చెప్మా" అని ఆలోచిస్తూనే కవరు చించేరు.

అంత ఆదుర్దాలోనూ మూర్తిగారికి రాములు యాస మాటలకు నవ్వు వచ్చింది. రాములు ఒకసారి చెప్పిన జోకుగూడ గుర్తుకు వచ్చింది ఆయనకు.

నెల్లూరునుండి ఓ పెద్దమనిషి గుంటూరులోని తన స్నేహితుడింటికి వెళ్ళేట్ట. మాటా మంచీ, భోజనాలు అయిన తర్వాత గుంటూరాయన తన కూతురితో "మేడమీక తాళాం వేసి రామ్మా" అన్నారుట.

నెల్లూరాయన అదివిని సంతోషంగా "అరె- చెప్పలేదే- మిద్దెమీద సంగీత కచ్చేరీ అవుతోందా" అన్నాట్ట.

అది గుర్తుకొచ్చి నవ్వుతూనే టెలిగ్రాం తీసి చదివేరు.

"సువర్చల మెడ్రాస్ ఎక్స్‌ప్రెస్‌కు వస్తున్నది. స్టేషనుకు రావలసినది" సత్యం.

మూర్తిగారి అల్లుడిచ్చిన టెలిగ్రామది. పెదాలమీద దరహాసం ఎగిరిపోయింది. ఆయన వదనం మీద అనిర్వచనీయమైననీడలు కమ్ముకున్నాయి.

“అమ్మాయ్ వస్తోంది రాములూ — స్టేషనుకు వెళ్దాంపదండు” అన్నారు.

ఇంతలో గదిలో గోడగడియారం ఖంగు ఖంగుమని రెండు గంటలు కొట్టింది. బండి మూడు గంటలకొస్తుంది.

మూర్తిగారు భార్యను లేపేంతలోనే ఆవిడే లేచివస్తూ “ఏమిటండీ— అర్ధరాత్రి రాములొచ్చేడూ — ఏదో టెలిగ్రామంటున్నారూ —” అన్నది గాబరాగా.

“ఇదిగో — అల్లుడు టెలిగ్రాం యిచ్చేడు. కారణం బోధ పడటంలేదు. ఉత్తరం వచ్చి నాలుగు రోజులు కూడా కాలేదు మూడు నాలుగునెల్లో ఏకంగా అతే బదిలీ అయి వస్తున్నామనీ ఈ లోపుగా రావడం కుదరదని రాసేడు, మరి యిప్పుడు అమ్మాయిని ఒంటరిగా ఎందుకు పంపుతున్నాడో అర్థంగావడల్లేదు” మూర్తిగారు ఆదుర్దా అంతా వ్యక్త పరిచేరు. “ఇదేమన్నా తొందరపడి పోట్లాడివచ్చేస్తున్నదేమోనండీ — మాట తొందరకూడామా —”

“ఏమిటో — అయోమయంగా వుంది. రాములూ నేనూ స్టేషనుకెళుతున్నాంగానీ తలుపేసుకో —” మూర్తిగారు కండువా వేసుకుని బయలుదేరేరు.

ఇంతలో పిల్లలు లేచి కూర్చున్నారు. అక్క వస్తున్నదని తెలిసి కళ్ళు నలుపుకుంటూ మొహాలు చింకిచాటంత చేసుకున్నారు.

రాజేశ్వరి .... మూర్తిగారి భార్య. ఆవిడ మనసు మనసులో లేదు.

కూతురు అర్ధాంతరంగా ఎందుకు వస్తున్నదో అర్థంగాక దానికి కారణాలతోరణాలు వెతుకుతున్నది. దగ్గర కూడా కాదాయెను. ఏదో కారణం వుండే వుండాలి.

సత్యం తన తమ్ముడే. పినతల్లి కొడుకు. చాలబుద్ధిమంతుడని సువర్చల నిచ్చి చేసేరు. కన్యాదాన ఫలం దక్కుతుందని సువర్చల బాగా ఎదగకుండానే పెళ్ళి చేశారు. సువర్చల ఎంతో గారాబంగా పెరిగింది సువర్చల వస్తున్నదంటే సంతోషంగానే వుంది. గలగలా తిరుగుతూ — పెత్తనం చెలాయిస్తూ — ఆరిందాలా మాటలు చెప్తూ — యింటిని నిర్వహించడంలో దానికదే సాటి, అదివస్తే యిల్లు ప్రశాంతంగా వుంటుంది, పిల్లల స్నాన పానాదులు, కాఫీలు అదే చూస్తుంది. పిల్లలంతా “పెద్దక్క—” అంటూ ఒక నిమిషం విడిచి వుండరు. కాని సత్యం మనస్ఫూర్తిగా పంపుతున్నాడో లేదో — అలాగైతే మొన్ననే మూడు నాలుగు నెలలవరకూ రావడల్లేదని ఎందుకు రాస్తాడు.

“ఏకంగా ట్రాన్స్ఫరయాక వెళ్దాం. దూరాభారం ఖర్చు బోలెడవుతుంది” అనివుంటాడు సత్యం. మరేనూ మాటలా — ఇప్పుడు సవేమిటా అని



వుంటుంది. పైగా యిప్పుడే వెళ్ళి తిరా ఐని మొండికేసి వుంటుంది. ఇద్దరికీ మాటల యుద్ధం జరిగి వుంటుంది. అందులో మరీ అయిన సంబంధ మేమో_ మరీ యిదిగదుసుగా మాట్లాడి వుంటుంది. అందుకని పొమ్మంటాడు. లేకపోతే ఒంటరిగా ఎందుకు వస్తుంది.

ఆలోచనలు రాజేశ్వరిని నిద్ర పోనీయలేదు — పిచ్చి ఆలోచనలు— అలాగే కూర్చుండి పోయిందామె—"

మూర్తిగారు, రాములు స్టేషను కెళ్ళేరు. ఇంటి రావడానికి యింకా పావుగంట వ్యవధి వుంది. ఇంకా వయం _ అది సామాన్యంగా ఆలస్యం గానే వసుంటుంది.

ద్రంలా వున్నది. కూతురు ఏ గొడవ తీసుకొస్తున్నదోమరి. ఇది తొందర పడినా సత్యం తొందరపడే వాడుకాదు. చాల నెమ్మదస్తుడు. హాస్యం పాలు కూడ ఎక్కువ. ఈ పిల్లకు తగ్గవా డయితే యిప్పటికి ఎన్ని రాద్ధాంతాలు జరిగేవో - పండుగకు రమ్మని రాస్తే మూడు నాలుగు నెలలవరకు రావడం లేదని వుత్తరం రాశాడు. మరి ఈ టెలిగ్రాం ఏమిటో -

ఇంతలో బండి వస్తున్నట్లుగా ప్లాట్ ఫారంమీద గంట ప్రారంభ మయింది.

దడదడ లాడుకుంటూ బండివచ్చి ఆగింది. మూర్తిగారి గుండెకూడ దడ దడ లాడటం మొదలు పెట్టింది.

రాములుకు మూర్తిగారి కూతురు తెలుసును- "నేను యిటు వెతుకుతా- మీరు ముందుకు పొండి" అన్నాడు రాములు.

"ఏదీ ఎక్కడా - కనబడదే - ఎందుకు రాలేదబ్బా - కూతురు కన బడక పోయేసరికి ఆదుర్దా ఎక్కు వైంది.

చూసి చూసి విసుగు పుట్టి — "అమ్మాయ్ రాలేదు రాములా వెళ్దాం పద" అన్నారు మూర్తిగారు.

మూర్తిగారిలో అసిమితం ఎక్కు వైంది. "కారణం లేకుండా బయలు దేరి వస్తూ టెలిగ్రాం కూడ యిచ్చి ఎందుకు రానట్టు." ఏమిటో గొడవ అంతు చిక్కటం లేదు. మళ్ళా — రావడలేదని వుత్తరమో, టెల్గ్రామో వస్తుందేమో -

రాములు ఆఫీసుకు వెళ్ళేడు - మూర్తిగారు ముసిరే ఆలోచనలతో సతమతమవుతూ యింటికి వచ్చేరు

చెప్పుల చప్పుడువిని గబగబావచ్చి తలుపు తీసింది రాజేశ్వరి.

"అమ్మాయేదండీ" అన్నది.

"అమ్మాయి రాలేదు- బండి అంతా వెదికేం——"

"సరిగా చూశారాలేదో- యిబ్బంది పడగలదు - ఒకర్తే కూడాను-"

"ఇద్దరమూ వెతికేం - రాకపోతే మళా రాజీ పడ్డారేమో - మానుకుని వుంటారు"

"ఏమో బాబూ- అర్థంకాని మను షులు——" గొణుక్కున్నది రాజేశ్వరి. ఆదుర్దా అలా గొణుక్కునేట్లు చేసిం దామెను.

ఆలోచనల ముసురులో నిద్రరావ డంలేదు. తెలుగున్నర అయింది. ఇంకా నిద్ర ఏమిటని రాజేశ్వరి లేచి పెరట్లోకి వచ్చింది.

ఇంతలో ఒక రిక్షావచ్చి వాకిట్లో ఆగింది. సువర్చల సూట్ కేస్ తో వచ్చింది.

"అమ్మాయ్ - ఒకర్తెవే వచ్చే వుటే-" అని కావిలించుకుందికూతుర్ని రాజేశ్వరి.

గబగబా లోపలికి తీసుకుపోయి తేటువెలుతురులో చూసింది కూతుర్ని. అమ్మాయికేం నిక్షేపంలా వుంది. కాస్త భారం దించినట్లయింది ఆమెకు.

మూర్తిగారు లేచివచ్చేరు బద్ధ కంగా——

"టెలిగ్రాం యిచ్చేరు —— బండికి రాలేదేమిటమ్మా," అన్నారు.

"బండి అందలేదు నాన్నారూ —— బస్సుకు వచ్చేను. బస్సు యిప్పుడే వచ్చింది."

ఆయనకు ఎలా అడగాలో తోచడ లేదు. "ఇద్దరూ పోట్లాడుకున్నారా" అంటే ఏమి బాధ పడుతుందో —

"మూడు నెలల వరకు రామన్నారు గదటమ్మా— ఉత్తరంవచ్చి నాలుగు రోజులు కూడా కాలేదు "

సువర్చల నవ్వి వూరుకుంది.

"ఏమిటే — నవ్వి వూరుకుంటే గాబరాపడి చస్తున్నాం, తల్లీ ఆ టెలి గ్రాం వచ్చినప్పటి నుండీ—"

సువర్చల మళ్ళీ నవ్వింది. సూట్ కేస్ అక్కడపెట్టి గబగబా నిద్దరోతున్న పిల్లలవేపుకు దారితీసింది.

"అమ్మాయ్ — విషయం చెప్పకుండా నవ్వుతే మాకెలా తెలుస్తుంది. ఏం జరిగిందో చెప్పవే —"

"జరగడానికేముందీ మరేమీ — ఏమీలేదు—" అంటూ నే నవ్వింది మళ్ళీ సువర్చల.

మూర్తిగారికి తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. చివరికి ధైర్యం చేసి అడిగేశారు —

"ఇప్పుడు రామన్నారుగా — సత్యంతో పోట్లాడ లేదుగదా —"

"అవునే వాడితో పోట్లాడేశావేం—" రాజేశ్వరి భర్తకు వంతపలికింది.

"మీ తమ్ముడే బుద్ధిమంతుడన్నా— నేను ఒకగయ్యాళిని"

"మరి ఒక్కదానివే ఎలా వచ్చావుటా— నవ్వుతావుగానీ చెప్పవు."

"అబ్బ — ఏమీ లేదే — నేనేమీ చెప్పను బాబూ— ఆ గొడవేదో వాళ్ళు ఉత్తరం రాస్తామన్నారు. నన్ను ఒక్క రోజుకూడా అక్కడ వుండొద్దన్నారు"

రాజేశ్వరి గతుక్కుమంది. తన అనుమానాలేవీ వృథాపోవడల్లేదు—"

"అత్తగారూ — మామగారూ — కూడానా ,"

"అందరున్నూ — మీ తమ్ముడు సరేసరి — వాళ్ళకి వంతపలికేడు. వుండడానికి వీల్లేదంటే లేదని —" మళ్ళీ నవ్వింది సువర్చల.

"ఎలాగో నాలుగు నెలల్లో యిటే వస్తానుగా — నువ్వేమైనా వత్తిడి చేసేనా వెళ్ళాలని —"

"ఏదో అన్నను కో— అయినా'"

మూర్తిగారికి నిద్రాహారాలు అయిపోయాయి. ఈ పిల్ల సత్యంతో పోట్లాడే వచ్చింది. ఎంతని ఓపిక పడ్తాడు. ఇదొహ గడుసుది. ఝగడం పెట్టుకొచ్చింది.

సువర్చల నవ్వుకొంది.

తల్లికీ తండ్రికీ ఆమెధోరణి కోపం తెప్పిస్తోంది.

"ఇది చెప్పేట్లులేదు — ఉత్తరం వస్తుందిగా — బయటపడుతుందిగా" అనుకున్నారు మూర్తిగారు— విసుగ్గా ముసుగుపెట్టుకుని పడుకున్నారు.

పిల్లలు నిద్ర లేచిపోతారని అక్కడచ్చిందని.

రాజేశ్వరమ్మ ఎన్నో విధాల అడిగి చూసింది. కాని సువర్చల సమాధానం నవ్వు—

ఆమెకూ విసుగువచ్చి వూరుకుంది—

* * *

మూర్తిగారు ఆఫీసుకెళ్ళేరు. ఉత్తరం ఆఫీసుకు వచ్చేవుంటుంది. ఏం రాస్తుందో. అమ్మాయ్ ఎలాంటి ఎన్ని నెత్తికి తెస్తుందో. వాళ్ళు ఏమి రాస్తారో ఏమిటో— అనుకుంటూ—

కాని ఉత్తరం రాలేదు — మనసు చికాకుగావుంది. ఆరోజల్లా అస్తిమి

తగా గడిపేడు. ఏపనీ చెయ్యబుద్ధి కాలేదు.

"బాబుగారూ, అమ్మాయి వచ్చిందేమి" రాములు అడిగేడు.

"వచ్చిందిరాములూ" పైకిఅని "నా తలకు ఒక సమస్యకూడా తెచ్చి దలే" అని లోపల గొణుక్కున్నాడు.

"సాయంత్రం కాఫీ డుచ్చుకుంటూ యింటికి వెళ్ళేను ఇల్లంతా గారభసగా వుంది. పిల్లలు గోలచేస్తున్నారు.

రాజేశ్వరి ప్లేటులో లడ్లు పెట్టుకొస్తూ —"మీ వియ్యపురాలు పంపింది మధ్యాహ్నం వుత్తరం వచ్చింది — మీ కూతురు ఒక గొడవతెస్తుందా—" అన్నది.

మూర్తిగారి వదనం కళా విహీనమైంది—

"ఏమిటేమిటి?" అన్నారు ఆతృతగా.

"అందుకే — యింటికి నా పేరు మీద రాసిందావిడ— ఈ గొడవలు మీకు రాయడం భావ్యం కాదు" అనుకున్నారు మీ వియ్యపురాలుగారు."

"చంపక చెప్పు దూ — అనుకొన్నాంగా — గొడవ ఏదో అయిందని—"

"మీకు స్వాతంత్ర్యం కలుగుతోంది."

"తెలివితేటలు పక్కకుపెట్టి అర్థమయ్యేలా చెప్పు" విసుక్కున్నారు

"అబ్బ చెప్పవే— ఏం తోచడంలేదు కొద్దిసేపుంచి."

"అదేనండీ —మీకుస్వాతంత్ర్యం"

"నీకు మతిభ్రంశం—" అరిచేరు మూర్తిగారు—రాజేశ్వరికి నవ్వొచ్చింది.

"ఇప్పటివరకూ మీకా తాత ఈ యింట్లో స్థానం ఏమిటి."

"నా తలకాయ— స్థానమంటూ ఒక టేడిస్తే నువ్విట్లా అడించే దానివా,"

"అదికాదండీ."

"ఈ పిల్లలకు మీరేమవుతారు—"

"ఏమవుతాను — తండ్రిని—"

"అదే — యిప్పుడు — ఆ హోదా నుండి కదులుతున్నారు. స్థానం మార్పిడి— మీరు "తాత" కాబోతున్నారు."

మూర్తిగారు "ఆఁ" అన్నారు కళ్ళజోడు ఫ్రేముమీదుగా భార్యను చూస్తూ — ఆయన కళ్ళు మెరుస్తున్నాయి.

"స్థానభ్రంశం—" అన్నది రాజేశ్వరి.

మూర్తిగారు వుత్తరం చదివేరు—

"సువర్చలను లేడీ డాక్టరుకు చూపించేను — నువ్వు అమ్మమ్మవి కాబోతున్నావు రాజేశ్వరీ— పదిరోజుల్లో మూఢమి — ప్రయాణానికి మంచి ముహూర్తాలులేవు— ఈ తొందరలో మేము రాలేక పోతున్నాం — మీరు రావడానికి సమయం లేదు— అందుకని అమ్మాయిని ఒంటరిగా పంపాల్సివస్తోంది. మీ ముచ్చటలు తీర్చుకుని పిలయినంత త్వరలో పంపాల్సింది."

పిల్లమూక ఘొల్లుమంది —

మూర్తిగారి మనసు ఝల్లుమంది —

కళ్ళజోడు మరాగా ముక్కుమీదకు లాక్కుంటూ —

"ఏదీ — ఆ లడ్లు యిటు తే—" అన్నారు.

***